క్లుప్తంగా

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

గోకవరం: గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సోమవారం శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆదివారం తెలిపారు. గ్రామంలోని తాణాసెంటర్‌లో బ్రిటిషు కాలం నాటి వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ రహదారి 516–ఇ నిర్మాణంలో భాగంగా ఈ వంతెనకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ వంతెనకు సోమవారం ఉదయం ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం స్థానిక సంత మార్కెట్‌లో షెడ్లు నిర్మాణానికి భూమిపూజ చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజశ్యామలాదేవిగా వనదుర్గ అమ్మవారు



అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారు రాజశ్యామల దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పండితులు నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, బాల, కన్య, సువాసినీ పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చామర్తి కన్నబాబు, నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్, చెల్లపిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి మాస కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. పండితులు స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి మాస కల్యాణాన్ని తిలకించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



యర్రవరంలో మహిళకు కుట్టు మెషీన్ అందజేస్తున్న సారం ఫౌండేషన్ ప్రతినిధులు

ఏలేశ్వరం: యర్రవరంలో వితంతు మహిళలకు సారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. దామలంక నారాయణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు సత్యనారాయణ ఆర్థిక సాయంతో మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



జగ్గంపేటలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీని సత్కరిస్తున్న క్రైస్తవులు

జగ్గంపేట: రాష్ట్రంలోని అన్నివర్గాలతో పాటు క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. జగ్గంపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో జాన్ వెస్లీని ఆదివారం చర్చి పాస్టర్ జొన్నకూటి రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. క్రిస్టియన్ల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో లూథరన్ చర్చి సభ్యులు, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

ఎస్సైగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

తొండంగి: ఒంటిమామిడి పోలీస్ స్టేషన్ ఎస్సైగా జి.వెంకటేశ్వరరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా రవికుమార్ బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో అన్నవరం అదనపు ఎస్సైగా పని చేసిన వెంకటేశ్వరరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానని నూతన ఎస్సై తెలిపారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- సబ్ డివిజన్‌లోని 20,123 ఎకరాల్లో ప్రకృతి సాగు
- 500 మంది ఎస్సీ రైతులకు ఉచితంగా నవధాన్యం కిట్లు



డి.పోలవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కొర్ర పైరు



కేపీ మల్లవరంలో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీ ఏసుబాబు

తుని రూరల్: ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. దానికి తోడు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో రైతులు సైతం ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి హానికరం లేని ప్రకృతి సాగు ఉత్పత్తులకు రోజురోజుకూ గిరాకీ పెరుగుతుండడంతో సాగుదారులకు అధిక ఆదాయం లభిస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు, పండ్ల తోటలున్న రైతులకు ప్రకృతి వ్యవసాయం అనుకూలంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏటా వందలాది మంది రైతులు ప్రకృతి సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారు.

తుని సబ్ డివిజన్‌లో ప్రకృతి సాగు వివరాలు

మండలం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)	కిచెన్ గార్డెన్లు
తుని	3470	4706	2430
తొండంగి	4222	5756	3150
కోటనందూరు	858	999	623
శంఖవరం	3850	4831	2132
రౌతులపూడి	2780	383	1732

మెట్టలోనూ ఆసక్తి

మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి, కూరగాయలు, ఆకుకూరలు, అపరాలు, చిరుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. ఆరుతడిగాను, వర్షాధారంగాను ఈ పంటలను సాగు చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెప్పడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. మరో పక్క ప్రకృతి, సేంద్రియ ఉత్పత్తులకు మార్కెటింగ్, గిట్టుబాటు ధర చెల్లింపులపై అమూల్ ఆర్గానిక్ సంస్థతో ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాల ఉత్పత్తుల్లో అమూల్ సంస్థ అందిస్తున్నట్టే ప్రకృతి, సేంద్రియ ఉత్పత్తులకు మంచి గిట్టుబాటు ధర చెల్లించనుంది.



కేపీ మల్లవరంలో పొడి దుక్కులో వరి విత్తనాలు నాటుతున్న రైతులు



బీర, చిక్కుడు పాదుల్లో అంతర పంటగా సాగు చేస్తున్న ఆకుకూరలు

15,180 మంది రైతులతో..

వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది 15,180 మంది రైతులతో 20,123 ఎకరాల్లో ప్రకృతి సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. 12,324 మంది రైతులతో 12,214 ఎకరాల్లో తొలకరికి ముందు పొడి దుక్కుల్లో విత్తనాలు విత్తే (పీఎండీఎస్) పద్ధతులను అలవర్చినట్టు ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ అడిగర్ల రామకృష్ణ తెలిపారు. తమ సిబ్బంది సలహాలు, సూచనలు ఇవ్వడంతో 10,167 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు పెరటి సాగును (కిచెన్ గార్డెన్లు) చేపట్టారన్నారు. ఎస్సీ రైతులను ప్రోత్సహించేందుకు 500 మందికి నవధాన్యాల కిట్లు, జీవామృతం, బీజామృతం, నామాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్రాస్త్రం తదితర కషాయాల తయారీకి డ్రమ్ములు, సీడ్ టూ సీడ్ తయారీకి కిట్లను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా కొర్రలు, రాగుల సాగును ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

రెండెకరాల్లో 30 రకాల పంటలు



రెండు ఎకరాల్లో 30 రకాల పంటలు వేశాను. ప్రధానంగా పెసలు, మినుములు, కందులు, కూరగాయాలు, ఆకుకూరలు వంటి అంతర పంటల సాగు చేపట్టాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నాను. ఒక్కొక్కటిగా ఫలసాయం అందుతోంది.

– ఎస్.నారాయణమూర్తి, రైతు, కేఓ మల్లవరం

బీజామృతంతో విత్తన శుద్ధి



ఎకరాన్నర పొలంలో కొత్తగా కొబ్బరి, మామిడి, వంగ, నిమ్మ, జామ పంటలు వేశాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తెగుళ్లు రాకుండా ద్రవ బీజామృతంతో విత్తన శుద్ధి చేశాను. ఎంసీఆర్‌పీ యేసుబాబు, ఐసీఆర్‌పీలు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– సుర్ల గంగునాయుడు, రైతు, కేఓ మల్లవరం

వైభవంగా కాశీ కావిడి యాత్ర



జగ్గంపేటలో కాశీ కావిడి యాత్ర చేస్తున్న మార్వాడీలు

జగ్గంపేట: గ్రామంలోని మార్వాడీలు తమ ఆచారంలో భాగంగా ఆదివారం కాశీ కావిడ యాత్రను వైభవంగా నిర్వహించారు. స్థానిక విష్ణాలయం వద్ద ఈ యాత్రను నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ ప్రారంభించారు. విష్ణాలయం నుంచి మార్వాడీ మహిళలు, పురుషులు కావిళ్లను బుజాలపై ధరించి పాదయాత్రగా గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలోని శివాలయానికి చేరుకున్నారు. ఏడు కిలో మీటర్ల దూరం శివనామస్మరణ, విష్ణునామస్మరణ చేసుకుంటూ వెళ్లి ఉప్పలపాడు శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం, రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ ఏటా శ్రావణ మాసంలో ఈ యాత్ర చేస్తామని మార్వాడీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కుటుంబ ప్రభోదన్ ఖండవల్లి సూర్యనారాయణ, జగ్గంపేట ఖండ ప్రముఖ్ పాబోలు స్వామి, మార్వాడీ సంఘ నాయకులు మోతిలాల్ మాలి, అంచారా మాలి, భారత్ మాలీ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



గుమ్మళ్లదొడ్డిలోని రామగిరి కొండపై సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో పవిత్ర రామగిరి కొండపై వేంచేసిన సత్యనారాయణస్వామి సహిత కోదండరామ ఆలయంలో ఆదివారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం పవిత్ర మాసోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డీఎల్వీ రమేష్‌బాబు, ట్రస్టుబోర్డు సభ్యుడు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, స్థానిక ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్రతాల్లో సుమారు 140 మంది దంపతులు పీటలపై కూర్చొని వ్రతాలు ఆచరించారు. వ్రతాలు ఆచరించిన భక్తులకు దేవస్థానం నుంచి ఉచితంగా పూజాసామగ్రి, స్వామివారి ప్రతిమ, గోధుమనూక ప్రసాదం అందజేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరకణం రామలక్ష్మి, ఎంపీటీసీ కోట సత్యవతి, గ్రామ పెద్దలు ఏగి సత్తిబాబు, అబ్బిరెడ్డి చిన్ని, సరకణం మురళీ, సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: విఘ్నాలు తొలగించే వినాయకుని విగ్రహ పతిష్ఠ మహోత్సవం పట్టణంలో ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక షిర్డీ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలుత పురోహితుడు ముత్య రాంబాబు ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, గూడవిల్లి అర్జునరావు, ఎం.సముద్రయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన వీరబాబు



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలుపుతున్న వీరబాబు

శంఖవరం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వహణ సభ్యుడిగా ఎంపికైన ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఆకుల వీరబాబు ఆదివారం శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలు వీరబాబును అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, ఎంపీటీసీలు సీంద్రపు భాస్కరరావు, పిసిసెట్టి ప్రకాశ్, వైఎస్సార్ సీపీ నాయకులు చలంకూరి రాజబాబు, పత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్‌లో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున ఉన్న ఐఓసీఎల్ టెర్మినల్‌లో శనివారం లెవల్–3 మాక్‌డ్రిల్ నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి బి.పమిత, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి, రాజమహేంద్రవరం అగ్నిమాపక అధికారి కె.రమణ, గోకవరం ఎస్సై ఎంవీఆర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఐఓసీఎల్ పైపులైన్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే తీసుకునే నివారణ చర్యలను కళ్లకు కట్టినట్టు మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. ఐఓసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి టి.సాయికిషోర్ మాట్లాడుతూ మాక్‌డ్రిల్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఐఓసీఎల్, గెయిల్, హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ల మార్కెటింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి జాతర



పెంటపల్లి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని పెంటపల్లి గ్రామదేవత ముత్యాలమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల వరకు ఆలయ ప్రాంగణంలో భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీతారామ భజన సమాజం, శ్రీకృష్ణ మహిళా భజన సమాజం, శ్రీసత్యదుర్గ భజన సమాజం, భగీరథ భజన సమాజం సభ్యులు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీకృష్ణ భజన సమాజం గురువు కుక్కల అన్నవరాన్ని ఆలయ కమిటీ సభ్యులు జగదీష్, నాగన్న, పాండురంగ తదితరులు సత్కరించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శతాధిక వృద్ధుడికి సన్మానం



శతాధిక వృద్ధుడు కోరాడ లక్ష్మణమూర్తితో కుటుంబ సభ్యులు

ఏలేశ్వరం: నిండు నూరేళ్లు జీవించాలనే దీవెనలు అందుకున్నాడో ఏమో వందేళ్లు పూర్తిచేసుకున్నాడు ఆ వృద్ధుడు. కొడుకులు, కూతుళ్లు, మనవలు, మనవరాళ్లు కలిసి ఆదివారం ఆ వృద్ధుడిని ఘనంగా సన్మానించారు. మండలంలోని తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మణమూర్తికి వందేళ్లు పూర్తికావడంతో కుటుంబ సభ్యులు సన్మానించారు. వందేళ్లు దాటడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం ఉండడం విశేషం. నేటికీ తన పనులు తాను చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు లక్ష్మణమూర్తి.

ఉద్యోగ విరమణ చేసిన వీఆర్‌ఏకు సత్కారం

జగ్గంపేట: మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడిగా సేవలు అందించిన ఆర్.సోములును ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఘనంగా సత్కరించారు. సుమారు 40 ఏళ్ల పాటు వీఆర్‌ఏగా సేవలందించిన సోములును జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయంలో కాకినాడ జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు సురేష్ ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సత్కరించారు. ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిన బాబూజీ, డివిజన్ నేతలు, జగ్గంపేట వీఆర్ఏ సంఘం నేతలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



లోవలో కలిసిన పూర్వ విద్యార్థులు

తుని రూరల్: తుని రాజా పాఠశాలలో 1995–99 మధ్య పది, ఇంటర్మీడియెట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానం ప్రాంగణంలో వీరు కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 25 సంవత్సరాల కిందట కలసి చదువుకుని వేర్వేరు వృత్తుల్లో స్థిరపడినప్పటికీ ఇప్పుడు తామంతా ఒక్కచోట కలిసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఇకపై ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

లింగంపర్తిలో దైవజ్ఞాన ప్రచారం



లింగంపర్తిలో ప్రచారం చేస్తున్న జ్ఞానవేదిక ప్రతినిధులు


ఏలేశ్వరం: శ్రావణ మాసంలో వచ్చే శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని లింగంపర్తిలో ఆదివారం దైవ జ్ఞాన ప్రచారం చేశారు. ఆచార్య ప్రభోదానందా యోగీశ్వరులస్వామి ఆశీస్సులతో రాజమహేంద్రవరం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానవేదిక అధ్యక్షుడు శేఖర్‌బాబు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతంపై ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో శాంతరాజు, సత్యనారాయణ, ఆదిబాబు, సత్యవతి పాల్గొన్నారు.

ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుల నియామకం ?


అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా ఇద్దరిని నియమించినట్టు సమాచారం. వీరిలో ఒకరైన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఎస్.గాంధీరెడ్డి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మరొకరిని కూడా ప్రత్యేక ఆహ్వానితునిగా నియమించినట్టు తెలిసింది.

నారుమడి... నెర్రెలు పడి

- పీబీసీ ఆయకట్టు పరిధిలో శివారు ప్రాంతాలకు అందని నీరు
- ఎండుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు



రావికంపాడు, ఏవీ నగరం ప్రాంతంలో ఎండిన వరి నారుమడి



ఏవీ నగరంలో నెర్రెలిచ్చిన వరి పొలం

తొండంగి: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. కొద్ది రోజులుగా ఎండలు మండిపోవడంతో వరినారు మడులు ఎండుపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొండంగి మండలంలోని పీబీసీ పరిధిలో సుమారు 7300 ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఇప్పటి వరకూ 2500 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. ఏవీ నగరం, రావికంపాడు ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు కోసం వేసిన నారుమడులకు నీరందక ఎండిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఇంకా వరినాట్లు వేయాల్సి ఉంది. పొలాలను దమ్ము చేయడం, నాట్లు వేయడం మాట దేవుడెరుగు కనీసం నారు మడులకు నీరందడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీబీసీ కాలువ నుంచి వస్తున్న నీరు శివారు పొలాలకు అందడం లేదని రావికంపాడు గ్రామ రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీబీసీ నుంచి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం



ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవని కారణంగా నీటి ఎద్దడి ఏర్పడింది. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలేరు జలాలను ఆర్ఆర్ ట్యాంకుకు రప్పించి ఆయకట్టుకు విడుదల చేస్తాం. కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు పడ్డాయి. రెండు రోజుల్లో ఆయకట్టు రైతుల సహకారంతో శివారు పొలాలకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కాశీ సురేష్, ఇన్‌చార్జి డీఈ, ఏలేరు ఇరిగేషన్ సబ్‌డివిజన్, పిఠాపురం

నారుమడి ఎండిపోతోంది



పీబీసీ ఆయకట్టు పరిధిలో నాకు రెండెకరాల పొలం ఉంది. వరిసాగు కోసం నారుమడి వేసాను. మా పొలాలు పీబీసీ కాలువ శివారును ఉండటంతో నీందరడం లేదు. నారుమడి ఎండిపోతుంది. అధికారులు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

– మేడిశెట్టి శేషు, రైతు, రావికంపాడు.

మోటార్ బైక్‌లు ఢీ

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని దూసరపాము శివారు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, 108 సహాయంతో క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గోపాలపట్నానికి చెందిన వీరంరెడ్డి రాజు, కొప్పుల శివ పెళ్లి శుభలేఖలు పంచిపెట్టేందుకు మోటారు సైకిల్‌పై ఆదివారం దూసరపాము వచ్చారు. వారు తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఎదురుగా మరో మోటారు సైకిల్‌పై వస్తున్న వాసంశెట్టి అప్పన్నబాబును ఢీ కొట్టారు. ఈ ఘటనలో ముగ్గురి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురికి స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వారి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు.